విశాలాంధ్ర కృష్ణా జిల్లా

మంత్రి పదవులెవరికో..?

- పోటీపడుతున్న ఎమ్మెల్యేలు
- కూటమితో కొలిక్కిరాని క్యాబినెట్ కూర్పు
- కూడికలు తీసివేతల్లో చంద్రబాబు
- ఉమ్మడి కృష్ణాలో అదృష్టవంతులెవరో?

విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం: రాష్ట్రంలో కూటమి ఘన విజయం సాధించింది. ఈనెల 12న రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు నాలుగో సారి ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన నూతన క్యాబినెట్లో మంత్రి పదవులు ఎవరికి దక్కుతాయనే అంశం ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలు మంత్రి పదవి కోసం పోటీపడుతున్నారు. వీరిలో ఛాన్స్ ఎవరికి దక్కుతుందో తెలియకుండా ఉంది. ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బిజెపిలు కూటమిగా ఏర్పడి పోటీ చేయడంతో క్యాబినెట్లో మూడు పార్టీలకు స్థానం కల్పించాల్సి ఉంది. దీంతో ఎవరికి ఎన్ని మంత్రి పదవులు కేటాయిస్తారో తేలాల్సి ఉంది. ఇందుకు సంబంధించి కూటమి అధినేత చంద్రబాబు నాయుడు కూడికలు తీసివేతల్లో వున్నట్టు తెలుస్తోంది. ఈ ప్రక్రియ ప్రమాణ స్వీకారం లోపు ఫైనల్ కావచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

సామాజిక సమీకరణాలే మూలం..

ఈ నేపథ్యంలో మంత్రి పదవులు దక్కించుకునే అదృష్టవంతులు ఎవరనే అంశం సర్వత్ర ఆసక్తిగా మారింది. ఎన్నికల ఫలితాల్లో ఘన విజయం సాధించిన కూటమికి మంత్రివర్గం ఏర్పాటు సవాలుగా మారింది. గత ప్రభుత్వంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి సామాజిక సమీకరణాల నేపథ్యంలో తన క్యాబినెట్లో కులాలకు ప్రాధాన్యత కల్పించారు. అదే రీతిగా చంద్రబాబు నాయుడు తన క్యాబినెట్ను ఏర్పాటు చేసుకో వాలనే తలంపుతో ఉన్నట్టు తెలుస్తుంది. దీంతో సామాజిక సమీకరణాలు, పొత్తుల వారి కేటాయింపులు తదితర అంశా లను పరిగణలోకి తీసుకొని నూతన క్యాబినెట్ కూర్పు జరగనుంది.

కేంద్ర కేబినెట్ పై కసరత్తు...

మరోపక్క కేంద్రంలో సైతం ఎన్డీఏ క్యాబినెట్లో బిజెపితో పాటు టిడిపి జనసేన పార్టీలకు మంత్రి పదవులు దక్కనున్నాయి. టిడిపికి దాదాపు నాలుగు మంత్రి పదవులు కేటాయిస్తారనే

అభిప్రాయం వ్యక్తమవుతుండగా జనసేనకు ఒక మంత్రి పదవి లభిస్తుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే దీనిపై కసరత్తు ప్రారంభం కాగా ఆ దిశగా బాబు, పవన్ పావులు కదుపుతున్నట్టు వినికిడి. జనసేన నుంచి ఇద్దరు ఎంపీలు విజయం సాధించగా వారిలో మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరికి కేంద్ర క్యాబినెట్లో చోటు దక్కే అవకాశం మెండుగా కనిపిస్తోంది. టిడిపిలో ఈ ఛాన్స్ ఎవరికి దక్కుతుందో ఇంకా తేటతెల్లం కాలేదు. రాయలసీమ ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ఒక్కొక్క మంత్రి పదవి కేటాయించి కోస్తాంధ్రలో ఇరువురు కు కేంద్ర క్యాబినెట్లో స్థానం కల్పించాలనే అభిప్రాయంతో చంద్రబాబు నాయుడు ఉన్నట్టు తెలుస్తుంది . ఈ ప్రక్రియ పూర్తయితే తదనంతరం రాష్ట్ర క్యాబినెట్ పై దృష్టి సారిస్తారనే విషయం సుస్పష్టమవుతుంది.

ఉమ్మడి కృష్ణాలో చాన్స్ ఎవరికో...

ఈ నేపథ్యంలో ఉమ్మడి కృష్ణా జిల్లాలో మంత్రి పదవులు ఎవరికి లభిస్తాయనే అంశం తీవ్ర చర్చనీయాంశగా మారిం ది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొత్తం 16 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా మచిలీ పట్నం, విజయవాడ పార్లమెంటు పరిధిలో గల 14 నియోజకవర్గా లతో పాటు ఏలూరు పార్లమెంటు పరిధిలోగల కైకలూరు, నూజి వీడు నియోజక వర్గంలో గెలుపొం దిన అభ్యర్థులు సైతం మంత్రి పదవులపై కన్నేస్తు న్నారు. ఉమ్మడి కృష్ణాలో ఇద్దరూ లేక ముగ్గురభ్య ర్థులకు మంత్రి పదవులు దక్కవ చ్చనే అభిప్రాయం కానవస్తుంది. ఈ ముగ్గురు ఎవరనే అంశం సందిగ్ధంలో ఉంది. అయితే మొత్తం 16 చోట్లా కూటమి అభ్యర్థులే గెలుపొందడంతో ఎవరికి వారు తమకే మంత్రి పదవులు దక్కొచ్చనే ఆశతో వున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో మొత్తం 16 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను వీటిలో ఆరు చోట్ల కొత్త అభ్యర్థులు ఈ ఎన్నికల్లో గెలుపొందారు. పెడన నుంచి కాగిత కృష్ణ ప్రసాద్ పామర్రు లో వర్ల కుమార్ రాజా గుడివాడలో వెనిగళ్ళ రాము గన్నవరంలో యార్లగడ్డ వెంకట్రావు మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గంలో టిడిపి నుంచి తొలిసారిగా ఈ అభ్యర్థులు గెలుపొందారు. అలాగే విజయవాడ పార్లమెంటు పరిధిలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి బిజెపి అభ్యర్థి సుజనా చౌదరి అలాగే తిరువూరు నుంచి శ్రీనివాసరావు టిడిపి అభ్యర్థిగా తొలిసారి విజయం సాధించారు. మిగిలిన 10 మంది ఉమ్మడి కృష్ణాలో పాత కాపులే. అయితే నూతన క్యాబినెట్లో సీనియర్లకు ప్రాధాన్యత లభిస్తుందా లేక కొత్తవారికి అవకాశం వస్తుందా అనే అంశం ఇంకా సుస్పష్టం కావడం లేదు. కాగా తెలుగుదేశం పార్టీ నుంచి ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు మాజీ మంత్రి కొల్లు రవీంద్రకు నూతన క్యాబినెట్లో చోటు లభించవచ్చనే అంశాలు అధికంగా ఉన్నాయి. ఆ తర్వాత జనసేన నుంచి అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్కు ఛాన్స్ దక్క వచ్చని అలాగే బిజెపి అభ్యర్థిగా విజయవాడ పశ్చిమ నుంచి సుజనా చౌదరిని పరిగణలోకి తీసుకునే అవకాశాలు ఉన్నట్టు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ముగ్గురికి మంత్రి పదవులు కేటాయిస్తే కూటమిలో మూడు పార్టీలకు న్యాయం చేసినట్టు అవుతుందనే అభిప్రాయంతో అధిష్టానం ఉండవచ్చనే ఉద్దేశం బలంగా ఉంది. ఇందుకు తగ్గట్టుగానే ఆయా అభ్యర్థులు సామాజిక సమీకరణాలు కానవస్తున్నాయి. బీసీ మత్స్యకార వర్గాలకి సంబంధించిన కొల్లు రవీంద్ర మచిలీపట్నం నియోజకవర్గంకు ప్రాతినిధ్యం వహిస్తుండగా కాపు సామాజిక వర్గానికి సంబంధించిన మండల బుద్ధ ప్రసాద్ జనసేన పార్టీ నుంచి అవనిగడ్డ నియోజకవర్గంకు నేతృత్వం వహిస్తున్నారు. కమ్మ సామాజిక వర్గానికి చెందిన సుజనా చౌదరి విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో బిజెపి నుంచి గెలుపొందారు. ఈ ముగ్గురు మూడు పార్టీలు మూడు సామాజివర్గాలుకు చెందినవారు కావడంతో వీరికి అధిక ప్రాధాన్యత ఉండవచ్చనే బలమైన అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ఇదిలావుండగా ఉమ్మడి కృష్ణాలో మరికొందరు ఆశావహులు ఈ వరుసలో ఉన్నారు. వారిలో గుడివాడ నుంచి వెనిగళ్ళ రాము విజయవాడ తూర్పు నుంచి గద్దె రామ్మోహన్ నందిగామ నుంచి తంగిరాల సౌమ్య నూజివీడు నుంచి కేపీ సారథి మంత్రి పదవి ఆశిస్తున్న వారిలో ఉన్నట్టు తెలుస్తుంది. ఉమ్మడి కృష్ణాకు సంబంధించి వీరిలో ఎవరికి చోటు దక్కుతుందో ఇంకొన్ని రోజులు వేచి చూడాల్సిందే...

అసామాన్య స్థాయికి ఎదిగిన రామోజీ: రవీంద్ర

విశాలాంధ్ర-మచిలీపట్నం టౌన్: సామాన్య కుటుంబంలో జన్మించి అసామాన్య స్థాయికి ఎదిగిన ధీరుడు చెరుకూరి రామోజీరావు అని మాజీమంత్రి ప్రస్తుత మచిలీ పట్నం ఎమ్మెల్యే కొల్లురవీంద్ర అన్నారు. శనివారం రామోజీరావు మృతి చెందిన వార్తవిన్నవెంటనే ఆయన స్పందిస్తూ, పత్రికారంగంలో తెలుగు ఖ్యాతిని ప్రపంచ స్థాయికి తీసుకువెళ్లిన మహోన్నత వ్యక్తి అని, ఈనాడు సంస్థల అధినేతగా, ఉషా కిరణ్ మూవీస్, మార్గదర్శి చిట్ ఫండ్స్, ప్రియా పికిల్స్ గ్రూప్ ఆఫ్ చైర్మన్ గానేకాకుండా అనేక రంగాల్లో తెలుగువారి ఔన్నత్యాన్ని ప్రపంచవ్యాప్తంగాచాటడమే కాకుండా, పర్యాటక రంగంలో రామోజీ ఫిలింసిటీ నిర్మించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కీర్తిని దేశ నలుమూలల వ్యాప్తి చేశారని కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నామన్నారు.

మహోన్నత వ్యక్తి రామోజీరావు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - బంటుమిల్లి : పత్రికా రంగంలో తెలుగు భాషకు కృషి చేసిన మహోన్నత వ్యక్తి రామోజీరావు అని పెడన నియోజ కవర్గ శాసనసభ సభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. ఈనాడు సంస్థ అధినేత రామోజీరావు ఆకాల మరణానికి చింతిస్తూ శనివారం ఏపీ యూడబ్ల్యూజే బంటుమిల్లి శాఖ అధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్లో ఉమ్మడి కృష్ణజిల్లా యూనియన్ ఉపాధ్యక్షులు నందిగామ శివ శంకర వర ప్రసాద్ సమక్షంలో పలువురు ఘననివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లడుతూ అనేక రంగాల్లో రామోజీరావు చేసిన సేవలు ఎప్పటికీ మరచిపోలేని అన్నారు. రామోజీరావు మృతి పట్ల తీవ్ర విచా రం వ్యక్తం చేసిన ఆయన సంతాపం తెలియజేశారు. కృష్ణాజిల్లా పెదపారు పూడిలో సామాన్య కుటుంబంలో జన్మించిన ఆయన అసమాన్యంగా పత్రికా రంగంలో తెలుగు భాషకు సేవ చేశారని ఏపీయూడబ్ల్యూజే ఉమ్మడి కృష్ణజిల్లా యూనియన్ ఉపాధ్యక్షులు నందిగామ శివ శంకర వర ప్రసాద్ అన్నారు. తెలుగు సినిమా రంగంలోనే గానీ అనేక రంగాల్లో ఆయన చేసిన సేవలు మరచిపోలేనివన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవం తున్ని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

వాటర్ ట్యాంకుకు ఎమ్మెల్యే శంకుస్థాపన

విశాలాంధ్ర-కూచి పూడి: మొవ్వ మండలం మంత్రి పాలెంలో గ్రామస్తుల సహాయ సహకారా లతో నూతనంగా ఏర్పాటు చేసే వాటర్ ట్యాంకుకు పామర్రు ఎమ్మె ల్యే వర్ల కుమార్ రాజా శనివారం శంకుస్థాపన చేశారు. ఆయన ఎమ్మెల్యే అయిన అనంతరం తొలి సారిగా గ్రామంలో దళితులకు తాగునీటి సమస్య నివారణకు వాటర్ ట్యాంకుకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్ష కార్యదర్శులు లింగమనేని రామలింగేశ్వర రావు, వీరంకి తులసీ దాసు, గ్రామ పార్టీ అధ్యక్షుడు వేమూరి రజనీకాంత్, కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు నన్నపనేని వీరేంద్ర, మండల గ్రామస్తులు కొండపల్లి ఆత్రేయ, కొండపల్లి శివయ్య, గొర్రెపాటి రాజేష్, లింగమనేని వెంకటేశ్వరరావు, గొర్రెపాటి మురళీకృష్ణ, నెరుసు చంద్రశేఖర్, పామర్తి హరిబాబు, పాల్గొనగా సచివాలయ సిబ్బంది చప్పిడిలక్ష్మణ బాబు (గ్రేడ్ 5 కార్యదర్శి), ఇంజనీరింగ్ అసిస్టెంట్ బడుగు మౌనిక, వీఆర్వో సిహెచ్ రవికిరణ్, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ జోగి సురేష్ బాబు, సర్వే అసిస్టెంట్ సేలం బుజ్జిబాబు, అగ్రికల్చర్ సహాయకుడు కంచర్ల శివరామ కుమార్, మహిళా పోలీస్ మోతుకూరి అనిత తదితరులు పాల్గొని సహకరించారు. సచివాలయం సిబ్బంది పుష్పగుచ్చంతో ఎమ్మెల్యే కుమార్ రాజాను అభినందించారు.

రామోజీకి ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే సంతాపం

విశాలాంధ్ర-కూచిపూడి: ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ చెరుకూరి రామోజీరావు మరణం పట్ల మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ శనివారం సంతాపం ప్రకటించారు. రామోజీరావు మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని, తెలుగు పత్రిక రంగానికి దశాబ్దాలుగా ఆయన ఎనలేని సేవలు అందించారని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ రామోజీరావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పామర్రు నియోజకవర్గ తాజా శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా శనివారం మొవ్వలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని తన సంతాపం వ్యక్తం చేశారు. ఈనాడు సంస్థల చైర్మన్ రామోజీరావు మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. సామాన్య కుటుంబంలో జన్మించి అసమాన్య విజయాలను సాధించిన రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. పలువురు తెలుగుదేశం నాయకులు సైతం సంతాపం వ్యక్తం చేశారు.

కూటమి విజయోత్సవ ర్యాలీ

విశాలాంధ్ర-వీరుల పాడు: సార్వత్రిక ఎన్నికలలో కూటమి గెలుపు అనంతరం వీరులపాడు మండలంలోని జుజ్జూరు గ్రామంలో కూటమి విజయోత్సవ ర్యాలీ శనివారం నిర్వహించారు. తెదేపా,జనసేన,బిజెపి నాయకులు, కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. మహిళలు సైతం ఉత్సాహంగా పాల్గొన్నారు.

పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ సభ్యుల రాజీనామా

విశాలాంధ్ర - చల్లపల్లి: మండల పరిధిలోని మంగళాపురం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు చైర్మన్ పేరం నాగిరెడ్డి అన్నారు. శనివారం మంగళాపురం పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మన్ నాగిరెడ్డి, పర్సన్లు కొర్రపాటి ముఖర్జీ, కాళింగి ఆదిలక్ష్మి తమ పదవులకు రాజీనామా చేశారు. త్రిసభ్య కమిటీ ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించిన సందర్భంగా వారిని సొసైటీ సిబ్బంది ఘనంగా సత్కరించారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడుతున్న నేపథ్యంలో గత ప్రభుత్వం తమకు ఇచ్చిన పదవికి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ చంద్ర రవి, సిబ్బంది పాల్గొన్నారు.

రామోజీకి సీపీఐ ఘన నివాళి

విశాలాంధ్ర-మచిలీపట్నం: సామాన్య రైతు కుటుంబంలో పుట్టి ఎన్నో ఉన్నత శిఖరాలు అవరోదించిన చెరుకూరి రామోజీరావు మృతి సినీ రంగానికే కాకుండా పాత్రికేయ రంగానికి కూడా తీరని లోటని సీపీఐ నాయకులు మోదుమూడి రామారావు అన్నారు. శనివారం స్థానిక మోదుమూడి శ్రీహరి రావు భవనంలో రామోజీరావు మృతి పట్ల ఘన నివాళులు అర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణాజిల్లా గుడివాడ మండలంలోని పెదపారుపూడి గ్రామంలో ఒక సామాన్య రైతు కుటుంబంలో పుట్టి రామోజీరావు అంచలంచెలుగా ఎదుగుతూ సినిమా రంగంతోపాటు పాత్రికేయ రంగంలో కూడా ఆయన చేసిన కృషి మరువలేనిదని, ఇలా అన్ని రంగాల తనదైన ముద్ర వేసుకొని తాను వేసిన ప్రతి అడుగులో కొత్త పుంతలు తొక్కుతూ వందలాది మందికి జీవనోపాధి కల్పించి అనేకమంది కుటుంబాల్లో వెలుగు నింపారని ఆయన అన్నారు. అతను చేసిన సేవలకు పద్మభూషణ అవార్డు అందుకున్నారని ఆయన గుర్తు చేశారు. ఆయన జీవితాన్ని మనందరం ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు యర్రం శెట్టి ఈశ్వరరావు, మహిళ సమైక్య నాయకురాలు ఓడుగు రత్నకుమారి, లక్ష్మి, షేక్ జానమ్మ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు జాతీ వైభవానికి రామోజీ కృషి: మండలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : రామోజీరావు మరణంతో తెలుగు జాతీ ఒక మహోన్నత వ్యక్తిని కోల్పోయిందని అవనిగడ్డ ఎమ్మెల్యే, ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శనివారం ఆయన తన స్వగృహంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా మండలి మాట్లాడుతూ తెలుగు ప్రభావానికి తెలుగు జాతీ వైభవానికి నిరంతరం పరితపించారని తెలుగు భాషా పరిరక్షణ కోసం రామోజీరావ్ విశేష కృషి చేశారని, ప్రపంచ తెలుగు మహా సభలకు విస్తృత ప్రచారం కల్పించారన్నారు. ప్రపంచంలోనే అద్భుతమైన రామోజీ ఫిలిం సిటీ నిర్మాణం అపూర్వం అన్నారు. రామోజీరావ్ జీవితం వ్యక్తిత్వ వికాస గ్రంథం అన్నారు. ఈనాడు దినపత్రిక స్థాపన ఒక ప్రభంజనం. భారతీయ పత్రిక రంగంలో సంచలనంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రామ్, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, నర్మదా గ్రూప్స్ అధినేత గుడివాక శివరామ్, టిడిపి నేతలు బచ్చు రఘునాథ్తో పాటు పలువురు పాల్గొని రామోజీరావ్ చిత్రపటానికి నివాళ్ళు అర్పించారు.

శివాలయంలో ఎమ్మెల్యే పూజలు

విశాలాంధ్ర - కృత్తివెన్ను: నూతనంగా ఎన్నికైన పెడన శాసనసభ్యులు కాగిత వెంకట కృష్ణ ప్రసాద్, శిరీష దంపతులు శివాలయంలో స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వర స్వామి వారి దేవాలయం వద్ద ఆలయ మేనేజర్ సింగనపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కాగిత దంపతులను సిబ్బంది ఆలయ సంప్రదాయాలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి కి కాగిత దంపతులచే ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున దేవాలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో కాగిత ఇష్టాగోష్టిగా కార్యకర్తలతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో ఒడుగు తులసిరావు, పిన్నింటి రత్తయ్య, చేకూరి వెంకటరావు, బొర్రా ఏడుకొండలు, కానుమల్లి లక్ష్మీ శ్రీనివాస్లు గుడిసేవ కొండ, పులగం చిన్నబ్బులు, తదితరులు పాల్గొన్నారు.

కొమళ్ళపూడి పీఏసీఎస్ అధ్యక్షుడి రాజీనామా

విశాలాంధ్ర - కృత్తివెన్ను: కొమాళ్ళపూడి పిఏసిఎస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్లు కూనసాని లక్ష్మోజి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంగం అభివృద్ధికి, లాభాల బాటలో పయనించడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. తన పదవీకాలంలో సంఘం ఐదు రెట్లు అభివృద్ధి సాధించినట్లు పేర్కొన్నారు.

విధుల్లో అలక్ష్యం వహిస్తే కఠిన చర్యలు: కొల్లు

విశాలాంధ్ర-మచిలీపట్నంటౌన్: అధికారులు విధులలో అలక్ష్యం వహిస్తే క్షమించేది లేదని, వారిపై కఠిన చర్యలు తీసుకుం టామని మచిలీపట్నం ఎమ్మెల్యే కొల్లు రవీంద్ర అన్నారు. శనివారం మచిలీపట్నం హెడ్ వాటర్ వర్క్స్లో ఆకస్మిక తనిఖీచేసి, తాగునీటిసరఫరాలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతులు మార్చుకోకపోతే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. కుళాయిల ద్వారా మురుగునీరు వస్తుండటంపై ఎఈ సాయిప్రసాద్పై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే కుళాయిల ద్వారా మురుగు నీరు ఎందుకు వస్తుందని ప్రశ్నించారు. తాగునీటి సమస్యకు గల కారణాలను మున్సిపల్ కమిషనర్ని అడిగి తెలుసుకుని, నగర ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గతంలో మంచినీటి సమస్య లేకుండా చూశామనీ, కృష్ణానదిలో నీళ్ల లేవు, పులిచింతల డెడ్ స్టోరేజ్లోకి వెళ్లిందని, వర్షాలు పడితే గానీ ప్రాజెక్టు నిండే పరిస్థితి లేదని, గతంలో మాదిరి పట్టిసీమ నుండి గోదావరి నీళ్లను ఇక్కడకు వచ్చేలా కృషి చేస్తామన్నారు. ఫిల్టరేషన్ సమస్య తలెత్తకుండా చూడాలని కలెక్టర్ని కోరామని, తరకటూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వద్ద ట్రాన్స్ ఫార్మర్ కెపాసిటీ పెంచేందుకు ఆదేశాలు ఇచ్చా మన్నారు. గతంలో తాము నిర్మించిన రిజర్వాయర్లను వినియోగించని కారణంగా దిష్టిబొమ్మల్లా మారాయని, ఆరిజర్వాయర్లన్నింటినీ వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. గత పాలకులు అధికారులను స్వేచ్ఛగా పని చేయనివ్వలేదని, ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు ఇవ్వాలన్నదే మా లక్ష్యం అన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో జలజీవన్ కింద కృష్ణా నది నుండి నేరుగా పైప్ లైన్ నిర్మించేందుకు కృషి చేస్తాంఅన్నారు.

ఎమ్మెల్యే కుమార్ రాజాకు సత్కారం

విశాలాంధ్ర-కూచిపూడి: శాసనసభ్యులు వర్ల కుమార్ రాజాను శనివారం సంజీవిని వైద్యాలయం సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఆ వైద్యాలయంలో చికిత్స పొందుతున్న రోగిని పరామర్శించడానికి విచ్చేసి కుటుంబ సభ్యులను ఓదార్చి అటు రోగికి, ఇటు కుటుంబ సభ్యులకు తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఇదే సమయంలో వైద్యాలయానికి తొలిసారిగా విచ్చేసిన శాసనసభ్యులు వర్ల కుమార్ రాజాను ఆ వైద్యాలయ అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నిమ్మగడ్డ సత్యప్రకాష్, వైద్యాలయసలహా మండలి సభ్యులు పామర్తి శివకుమార్ ఆధ్వర్యంలో శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు నన్నపనేని వీరేంద్ర, కూచిపూడి గ్రామ నేతలు పామర్తి పాండు, ఓరుగంటి నాగరాజు, యార్లగడ్డ పాండురంగరావు తదితరులు పాల్గొన్నారు

లక్ష్య సాధనే రామోజీరావు నైజం

విశాలాంధ్ర-పమిడిము క్కల: ప్రముఖ వ్యాపారవేత్త, అక్షర యోధుడు, ఏ పనిలో నైనా లక్ష్య సాధనే రామోజీ రావు నైజమని మండల టీడీపీ అధ్యక్షుడు రాజుల పాటి శ్రీనివాస రావు అన్నారు. శనివారం ఆయన మృతికి సంతాపం తెలుపుతూ చిత్రం పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ వీరంకిలాకు గ్రామంతో బంధుత్వాలు వున్నాయని, వ్యక్తిగతంగా వామపక్ష భావజాలాన్ని నమ్మిన వారిని "ఈనాడు"దినపత్రిక తెలుగు నాట ఓ ఆత్మీయ బంధువు గా నిలిచిందని, అనేక సంస్థలు స్థాపించి వేల మంది జీవితాల్లో వెలుగులు నింపిన వ్యక్తి అని ఆయన లేని లోటు తీరదని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం నాయకులు నాదేళ్ళ సుబ్రహ్మణ్యం ఎస్.వెంకటేశ్వర స్వామి,ఇ.వెంకటేశ్వర రావు ఎ.గోపాలకృష్ణ వీర కుమార్,వీరంకి ప్రభుదాస్ బోలెం లక్ష్మీనారాయణ పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రామోజీ మృతి విచారకరం

విశాలాంధ్ర - చల్లపల్లి: ప్రముఖ సినీ నిర్మాత, ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మరణం అత్యంత విచారకరమని టిడిపి జిల్లా బిసి నాయకులు మోర్ల ప్రసాద్ అన్నారు. చల్లపల్లిలో టిడిపి కార్యాలయం వద్ద చెరుకూరి రామోజీరావు సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రామోజీ చిత్రపటానికి టిడిపి నాయకులు పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోట విజయ రాధిక, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు మోర్ల శివ, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ నభిగోరి, టిడిపి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని రామోజీరావు ఫోటోకు పుష్పాంజలి ఘటించారు.

రామోజీకి గ్రామస్తుల నివాళి

విశాలాంధ్ర-పెదపారు పూడి: దేశ విదేశాలలో ప్రముఖ వ్యాపారవేత్తగా పేరొందిన, ఏ రంగంలో అడుగుపెట్టిన అభివృద్ధి పథంలో నడిపించిన మహా వ్యక్తి చెరుకూరి రామోజీరావును గుర్తు చేసుకుంటూ పెదపారు పూడి రామాలయం సెంటర్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా శనివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సప్పిడి సమీరా కిషోర్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి విషయంలో గ్రామాన్ని దత్తత తీసుకుని తన సొంత నిధులు వెచ్చించి విద్యార్థులకు చదువుకునేందుకు ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గ్రామస్తులకు తాగునీరు కొరకు మంచినీటి కుళాయి, ఇంటింటికి టాప్ కనెక్షన్, ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మాణం, పశు పోషకులకు పశు వైద్యశాల భవన నిర్మాణం, గ్రామంలోని ఊర చెరువు అభివృద్ధి కొరకు ఫినిషింగ్, గ్రామంలో రోడ్లు, సొసైటీ బ్యాంక్ భవన నిర్మాణం తదితర విషయాలలో అభివృద్ధి చేసిన ఘన కీర్తి చెరుకూరి రామోజీరావు అని సర్పంచ్ మరియు గ్రామస్తులు కొనియాడారు. నివాళులర్పించిన గ్రామస్తులు సూరపనేని రమణబాబు, సూరపనేని సురేంద్రబాబు, పునుకొల్లు ప్రసాద్, చెరుకూరి మల్లికార్జునరావు, పాలడుగు గణేష్, పునుకొల్లు బెనర్జీ, గ్రామంలోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఆ మహానేత రామోజీరావుకు నివాళులు అర్పించినట్లు దూళ్ల జమ్మి బాబు ఒక ప్రకటనలో తెలిపారు.

వెనిగండ్ల రాము ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - గుడి వాడ : స్థానిక జగన్నా ధపురంలోని శ్రీ భూనిలా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్లతో కలసి ప్రతేక పూజలు నిర్వహించారు. శనివారం వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి వారిన దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం దేవస్థాన అధికారలు ఎమ్మెల్యే రాము ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, దేవదాయ శాఖ సిబ్బంది, పాల్గొన్నారు.

రామోజీకి ఏపీయూడబ్ల్యూజే నివాళి

విశాలాంధ్ర-గన్నవరం: ఈనాడు పత్రిక అధినేత స్వర్గీయ రామోజీ రావుకు కృష్ణాజిల్లా. ఏపీయూడబ్ల్యూజే ఉపాధ్యక్షుడు అట్లూరి రాజశేఖర్ ఆధ్వర్యంలో హనుమాన్ జంక్షన్ నాలుగు రోడ్ల కూడలివద్ద ఘన నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ పత్రికా రంగంలో తనదైన ముద్ర వేసుకుంటూ అలాగే చిట్ఫండ్ కంపెనీ, పచ్చళ్ళు, సినీ రంగంలోనూ ఇలా ఏ రంగంలో అడుగుపెడితే ఓటమి ఎరుగని వీరుడు అని కొనియాడారు ఈ కార్యక్రమంలో అక్కినేని ఫణీంద్ర అంకమ్మ బాబు చలమలశెట్టి శ్రీనివాసరావు కిరణ్ ,రఘు, కిషోర్ హరికృష్ణ ,శ్రీను రామకృష్ణ ,కరీం సుబ్రహ్మణ్యం రామోజీరావుకు నివాళులు అర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు

కలిసిమెలిసి జీవించాలి: ఎస్ఐ

విశాలాంధ్ర-పమిడిముక్కల: గ్రామంలో అందరూ కలిసిమెలిసి ఉండాలని, ప్రతి చిన్న విషయానికి మనస్పర్థలు పెంచుకోవద్దని ఎస్ఐ శ్రీనివాస్ అన్నారు. శనివారం అలినకీపాలెంలో గ్రామస్తులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి సంఘటనలకు పాల్పడవద్దని ఏదైనా సమస్య వచ్చినా పెద్దలతో పరిష్కార మార్గం చూడాలని సాధ్యం కాకపోతే పోలీసు సహాయం తీసుకోవాలని సూచించారు.

రామోజీరావు మృతి తీరనిలోటు: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): రామోజీరావు మరణం తీరనిలోటని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వర రావు అన్నారు. శనివారం ఉమా కార్యాలయంలో రామోజీరావు చిత్రటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామోజీరావు మీడియా, చలన చిత్ర రంగాల్లో బలమైన ముద్ర వేశారని కొనియాడారు. ఆయనలోని ఉత్సుకత, దూరదృష్టి, సంకల్పంతో ప్రవేశించిన ప్రతి రంగంలోనూ తనదైన ముద్ర వేశారని అన్నారు. అందరికీ ఆదర్శంగా నిలిచారని తెలిపారు. మీడియాలో మృతభాషల అభివృద్ధిలో అసమానమైన పాత్ర పోషించారని, చిత్ర పరిశ్రమలో ఆయన అందించిన సహకారం ఎనలేనిదని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

రామోజీ మృతిపై వెలంపల్లి సంతాపం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఈనాడు గ్రూప్ సంస్థ చైర్మన్ రామోజీరావు మృతి పట్ల మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు సంతాపం ప్రకటించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పత్రిక, సినీ పరిశ్రమ రంగాల్లో చెరగని ముద్ర వేశారన్నారు. తెలుగు భాష సంస్కృతులకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు.

రామోజీకి ఎమ్ఎస్ బేగ్ నివాళి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావు మృతికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ఎమ్.ఎస్ బేగ్ నివాళులర్పించారు. విజయవాడ వించిపేటలోని ఆయన కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి టీడీపీ శ్రేణులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రిక రంగంలో రామోజీరావు ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. రామోజీరావు జీవించినంత కాలం సమాజ సేవ కోసమే పని చేశారని వెల్లడించారు. అదేవిధంగా తెలుగురాష్ట్రాల నుంచి కాకుండా దేశ, విదేశాల నుంచి రామోజీ ఫిలిం సీటిని చూడటం కోసం వస్తారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు సుకాశి కిరణ్, బూర కనకారావు, సుకాశి సరిత, అబ్దుల్ సత్తార్, బేవర సాయి, సుధాకర్,నమ్మి భాను ప్రకాష్, మీర్జా ముజాఫర్ బేగ్, మక్కెన భాస్కర్, బడుగు వెంకన్న, బంక సురేష్, ఆలీ, లక్ష్మీ, టీమ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అక్షర యోధుడికి అమృత నివాళి

విశాలాంధ్ర - పెనుగంచిప్రోలు : పాత సినిమా హాల్ సెంటర్‌లో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల వెంకట సీతారామయ్య ఆధ్వర్యంలో ఈనాడు పత్రిక వ్యవస్థాపకులు రామోజీరావు మృతి పట్ల సంతాపం తెలియజేస్తూ ఆయన చిత్రపటానికి మాజీ డిసి చైర్మన్ వేగినటి గోపాలకృష్ణమూర్తి పూలమాలలు వేసినివాళులర్పించారు. పెనుగంచిప్రోలు గ్రామ ప్రజలు ఆయన ఈ రాష్ట్రానికి చేసిన సేవలను కొనియాడుతూ పత్రిక రంగానికి తెలుగు భాషకు సినీ పరిశ్రమకు ఎనలేని సేవలను కొనియాడారు. రామోజీకి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి గజ్జికిష్టమూర్తి, మాజీ సర్పంచ్ జిల్లేపల్లి సుధీర్ బాబు, కొత్తపల్లి సతీష్, కర్ల నాగేశ్వరరావు, నూతలపాటి కృష్ణ, నల్లపునేని కొండ, మహమ్మద్ అజాద్, పెనుగొండ గోపాలరావు, బొల్లంలింగయ్య, లగడపాటి ప్రవీణ్, మాదినేని వెంకట్రావు, మాదినేని శివ, గుగులోతు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అన్నసంతర్పణ

విశాలాంధ్ర-అవనిగడ్డ : జనసైనికుల ఆధ్వర్యంలో అన్నసంతర్పణ కార్యక్రమం 48 వ వారం కొనసాగింది. ఆంధ్రుల అన్నపూర్ణగా పేరొందిన డొక్కా సీతమ్మను ఆదర్శంగా తీసుకుని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు గరికిపాటి రామ్, వివేక్ మిత్ర బృందం ఆధ్వర్యంలో ప్రతి శనివారం మధ్యాహ్నం అవనిగడ్డ, కోడూరు రోడ్డులో గల పెట్రోల్ బంక్ వద్ద అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 48వ శనివారం కరెంట్ వీరయ్య జ్ఞాపకార్థం మనువడు చింటు ఆర్థిక సహకారంతో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.టి.సిలు బొప్పన బాబు, మద్దెల అజయ్ కుమార్, కొప్పనాతి సాయి బాబు, గుడివాక రామాంజనేయులు, మాదివాడ కుటుంబరావు, జనసైనికులు సేవలందించారు.

ఉపాధ్యాయుల ఆంక్షలను నెరవేర్చాలి

విశాలాంధ్ర అవనిగడ్డ : ప్రభుత్వ ఉపాధ్యాయుల ఆంక్షలను నూతన ప్రభుత్వం నెరవేర్చాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి కనకారావు అన్నారు. శనివారం యుటిఎఫ్ జిల్లా, నియోజకవర్గ నాయకులు నూతనంగా ఎం.ఎల్.ఎ గా ఎన్నికైన మండలి బుద్ధప్రసాద్‌ను తన ఇంటి వద్ద ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి కనకారావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అనేక నిర్బంధాలు ఎదుర్కొని మానసికంగా నలిగిపోయామన్నారు. నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ రద్దు చేయాలని జీఓ నెం 117 రద్దు చేయాలని, పాఠశాలల విలీనం ఆపాలని పి.ఆర్.సి బకాయిలు, డి.ఎ.ఎరియస్, పిఎఫ్ కోసం తాము పోటాడితే వైసిపి ప్రభుత్వం పరిష్కారం చేయకుండా కాలాయాపన చేయడంతో పాటు తమను ఆరెస్టులతో వేదించారన్నారు. ప్రతిఫలంగా పోస్టర్ బ్యాలెట్ రూపంలో తమ అనూహ్య స్పందన గమనించిన ప్రజలు తమ నిర్ణయాన్ని కూడా పూర్తి స్థాయిలో ప్రతిబింబించేలా ఓట్లు వేసారు. రానున్న ఎన్.డి.ఎ ప్రభుత్వం తమ సమస్యలను తీర్చాలని న్యాయపరమైన డిమాండ్‌లను పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున యుటిఎఫ్ రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రమాణస్వీకార ఏర్పాట్లపై సమీక్ష

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి చేయాల్సిన ఏర్పాట్లపై రాష్ట్ర రవాణా, రహదారులు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్న పీఎస్ శనివారం గన్నవరం విమానాశ్రయం లోని కాన్ఫరెన్స్ హాల్లో ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు, కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, వివిధ శాఖల ఉన్నతాధికారులు తదితరులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 12వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేయనున్నారు. ముఖ్యకార్యదర్శి ప్రద్యుమ్న మాట్లాడుతూ ఈ కార్యక్రమ నిర్వహణకు గన్నవరం మండలం, కేసరపల్లి గ్రామంలోని ఐటీ పార్కు మేధ టవర్స్ సమీపంలో స్థలాన్ని ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమ ప్రాంగణం, వేదిక, బ్యారికేడింగ్, పార్కింగ్, పారిశుధ్యం, ప్రముఖులకు వసతి, వైద్య శిబిరాల ఏర్పాటు, భద్రత తదితరాలపై సమావేశంలో చర్చ జరిగిందన్నారు. సమావేశం అనంతరం ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల మార్గనిర్దేశనం, క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయంతో కృషిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీసీపీ అధిరాజ్ సింగ్ రానా తదితరులు పాల్గొన్నారు.

మెదడును జాగ్రత్తగా కాపాడుకోవాలి

అవగాహన సదస్సులో డాక్టర్ సౌరీబాల

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : శరీరంలో అత్యంత ముఖ్యమైన భాగం మెదడని చెప్పొచ్చు. బ్రెయిన్ చాలా సున్నితంగా ఉంటుంది. చాలా జాగ్రత్తగా మెదడును కాపాడుకుంటూ ఉండాలి. ఏ చిన్న దెబ్బ తగిలినా.. ప్రమాదమే. అలాగే నిర్లక్ష్యం చేస్తే నిండు ప్రాణాలు పోతాయని రైల్వే ఆసుపత్రి చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.సౌరీబాల తెలిపారు. ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ అవేర్‌నెస్ డే సందర్భంగా శనివారం డివిజనల్ రైల్వే హాస్పిటల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సిఎంఎస్ డాక్టర్ సౌరీబాల మాట్లాడుతూ బ్రెయిన్‌కి వచ్చే ప్రమాదకరమైన వ్యాధుల్లో ట్యూమర్ ఒకటి. ఈ బ్రెయిన్ ట్యూమర్ వచ్చిందంటే వ్యక్తి బతుకుతాడన్న నమ్మకం ఉండదన్నారు. ఇంత ప్రమాదకరమైన బ్రెయిన్ ట్యూమర్ వ్యాధి లక్షణాలు ఎలా ఉంటాయి అంటే మెదడులోని కణితులు ఏర్పడతాయి. ఇవి బ్రెయిన్ పని తీరుకు ఆటంకం ఏర్పడుతాయి. వీటి వల్ల మతి మరుపు ఏర్పడటం, ఏకాగ్రత నశించడం, నడకలో ఇబ్బందులు, తల నొప్పి ఎక్కువగా రావడం, ప్రవర్తనలో మార్పులు, నాడీ సమస్యలు వస్తాయి. ఈ వ్యాధిని మొదట్లోనే గుర్తించి సరైన చికిత్స తీసుకోకపోతే ప్రాణానికే ప్రమాదమని అన్నారు. పర్యావరణ ప్రమాదాలను నివారించడం, రేడియేషన్‌కు గురికావడం, ధూమపానానికి దూరంగా ఉండాలన్నారు. హాస్పిటల్‌లోని రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సాయి స్నేహిత్ బ్రెయిన్ ట్యూమర్‌ల కారణాలు, చికిత్స గురించి ప్రేక్షకులకు అవగాహన కల్పించారు. ముందస్తుగా గుర్తించడం కోసం ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా హెల్త్ చెకప్‌లు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎసిఎమ్ఎస్ డాక్టర్ ఎం. జైదీప్ తదితరులు పాల్గొన్నారు.

రామోజీరావుకు ఘన నివాళి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు మృతి దేశానికి తీరని లోటని పలువురు వక్తలు నివాళులర్పించారు. శనివారం సాయంత్రం అబ్దుల్ కలాం సేవా సమితి అధ్యక్షులు వేముల వెంకట్రావు ఆధ్వర్యంలో విజయవాడ వాగు సెంటర్‌లోని వెంకట్రావు కార్యాయలంలో రామోజీరావుకి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ చైర్మన్ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ రామోజీరావు బిజినెస్ పరంగా ఎంతో మందిని తీర్చిదిద్దారని కొనియాడారు.
ఒక మంచి రంగంలో ఒక క్రమశిక్షణ గల ఈనాడు సంస్థ, ఈటీవీ, ప్రియా పికిల్స్, సినిమా రంగంలో నిర్మాతగా, ప్రపంచం లోనే అత్యున్నతమైన రామోజీ ఫిలిం సిటీని ఏర్పాటు చేసిన మహనీయుడని అన్నారు. ఎంతోమంది కళాకారులను తయారుచేసిన గొప్ప మనసున్నటువంటి వ్యక్తి రామోజీ పరమపదించడం చాలా బాధాకరమని తెలియజేశారు .ఈ కార్యక్రమంలో విజయవాడ నగర ప్రముఖులు ఎన్వి రావు, సూర్యారావు , బలివాడ శివకుమార్ పట్నాయక్, భోగవల్లి శ్రీధర్, బాయన శేఖర్ బాబు , నమ్మి అప్పారావు, రాజగిరి సోమేశ్వరావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొని రామోజీరావుకు ఘనంగా నివాళులర్పించారు.

పిల్లలు శారీరక దృఢత్వం కలిగి ఉండాలి

విశాలాంధ్ర, విజయవాడ (గాంధీనగర్) : పిల్లల్లో శారీరక దృఢత్వం ఉంటే అనుకున్న లక్ష్యాలను సులభంగా అందుకుంటారని ఏడిఆర్ఎం (ఇన్ఫ్రాస్ట్రక్చర్) పి.ఇ.ఎడ్విన్ తెలిపారు.విజయవాడ డివిజన్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన సమ్మర్ కోచింగ్ క్యాంప్ ముగింపును రైల్వే మినీ స్టేడియంలో ముగిసింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏడిఆర్ఎం మాట్లాడుతూ పిల్లలకు విద్యతో పాటు మానసిక ఉల్లాసం కలిగే విధంగా ఆటల్లో పాల్గొంటే శారీరక దృఢత్వం కలిగి వారు ఉన్నత శిఖరాలను అదరోహించగలుతారన్నారు. పిల్లలను వారి తల్లిదండ్రులు కేవలం చదువుల్లో ర్యాంక్‌లు చూడకుండా ఇటువంటి వాటిల్లో కుడా ప్రోత్సహించాలని సూచించారు.అనంతరం శిబిరంలో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, క్రికెట్, వాలీ బాల్,టెన్నిస్ వంటి వివిధ క్రీడలలో శిక్షణ పొందిన 68 మంది పిల్లలకు సర్టిఫికెట్లు,బహుమతులను ఏడిఆర్ఎం అందజేశారు.సీనియర్ డిసీస్ , డివిజనల్ స్పోర్ట్స్ ఆఫీసర్ వల్లేశ్వర బి తోకల మాట్లాడుతూ సుదీర్ఘ విరామం తర్వాత సమ్మర్ కోచింగ్ క్యాంపును విజయవంతంగా నిర్వహించినందుకు శిక్షణ సిబ్బందిని అభినందించారు.సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో విద్యార్థులకు క్రీడల ప్రాముఖ్యతను వివరించారు. పిల్లలు ఆడటం కొనసాగించే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. సమ్మర్ క్యాంప్‌కు తమ పిల్లలను పంపినందుకు వార్డుల తల్లిదండ్రులను అభినందించారు.ఇలాంటి శిబిరాల ద్వారా పిల్లలు చిరకాల జ్ఞాపకాలను పెంపొందించుకుంటారని వారి సామాజిక పరస్పర నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటారన్నారు.

అన్ని రంగాల్లో ఇంజనీర్స్ పాత్ర కీలకం

- డాక్టర్ జి.వి.ఆర్.ప్రసాద రాజు
- అమ్రిత సాయిలో గ్రాడ్యుయేషన్ డే

విశాలాంధ్ర- కంచికచర్ల: అన్ని రంగాలలో ఇంజనీర్స్ పాత్ర చాలా కీలకంగా ఉందని కాకినాడ జెఎన్‌టి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.వి.ఆర్.ప్రసాద రాజు అన్నారు. కంచికచర్ల మండలం పరిటాల సమీపం లోని అమ్రిత సాయి ఇంజనీరింగ్ కళాశాలలో మూడవ అటానమస్ బ్యాచ్ 4 సంవత్సరాల ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేసుకున్న సందర్భంగా విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం కళాశాలలో శనివారం జరిగింది. కార్యక్రమానికి కాకినాడ జె ఎన్ టి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.వి.ఆర్. ప్రసాద రాజు ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు దశ దిశ నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రసాద్ రాజు మాట్లాడు తూ ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేసిన విద్యార్థులందరికీ శుభాభినందనలు తెలియచేస్తూ, అందరూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అంతే కాకుండా మానవతా విలువలు, సామాజిక బాధ్యతను కలిగి ఉండాలని కోరారు. ప్రస్తుతం అన్ని రంగాలలో ఇంజనీర్ పాత్ర చాలా కీలకంగా ఉందని, ఇంజనీరింగ్ లో ప్రతి బ్రాంచ్ కు చెందిన ఇంజనీర్ దేశానికీ అవసరమని తెలిపారు.అంతే కాకుండా అమ్రిత సాయి కళాశాల,యూనివర్సిటీ స్థాయి లో ఇండస్ట్రీ అవసరాలకు తగ్గట్లుగా అకడమిక్ కరిక్యులం నిర్వహిస్తున్నందు కు హర్షం వ్యక్తం చేసారు. ఉన్నతమైన లక్ష్యాన్ని చేరుకోవాలంటే నిరంతర సాధన చేయాలని సూచించారు. కళాశాల ప్రెసిడెంట్ కె. లక్ష్మీ కార్తీక్, సెక్రటరీ కరస్పాండెంట్ కె. రామ్మోహన రావు మాట్లాడుతూ 2020-24 అటానమస్ మూడవ బ్యాచ్ లో 454 మంది విద్యార్థులు ఇంజనీరింగ్ డిగ్రీ పట్టా పొందారని, వీరందరికి ప్రొవిజినల్ సర్టిఫికేట్స్ అందచేశామన్నారు. ప్లేసెమెంట్స్ లో 243 ప్రోడక్ట్ డెవలప్మెంట్ ఆఫర్స్ తో 12 లక్షల అత్యధిక వార్షిక వేతనంతో విద్యార్థులు సత్తా చాటారని తెలిపారు.విద్యార్థులకు మొదటి సంవత్సరం నుండే ఎల్ ఎం ఎస్ ఆన్లైన్ ప్రోగ్రామింగ్ లాబ్స్ ద్వారా కెరీర్ ఓరియెంటేషన్ ప్రోగ్రాం చేస్తున్నామని,రాష్ట్రస్థాయిలో ఇండస్ట్రీ కొలాబరేషన్ తో కళాశాలలో ఏర్పాటు చేసిన ఎథికల్ హ్యాకింగ్ ల్యాబ్,సైబర్ ఫోరెన్సిక్స్ ల్యాబ్, బ్లాక్ చైన్, క్రిప్టో ల్యాబ్ వంటి అడ్వాన్స్ లాబ్స్ ద్వారా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామ ని తెలిపారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యమ్.శశిధర్ మాట్లాడుతూ విద్యార్థు లకు చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టం విధానం లో అకడమిక్ ప్రోగ్రాం చేస్తున్నామని, అమ్రిత సాయి విద్యార్థులు బి.టెక్ నాలుగేళ్ళ వ్యవధిలో మైనర్ డిగ్రీ కూడా పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమం లో 2020 -2024 బ్యాచ్ కు సంబంధిచిన కాలేజీ టాపర్ సి.యస్.ఈ బ్రాంచ్ ఎం. మృదులతో పాటు, 9 మంది బ్రాంచ్ టాపర్స్ కు కళాశాల నుంచి గోల్డ్ మెడల్స్, ప్రశంసా పత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ పి.చిరంజీవి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎం. శ్రీదేవి, అన్ని విభాగాల అధిపతులు, మూడవ అటానమస్ బ్యాచ్ విద్యార్థులు, తల్లి దండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రామోజీ జీవితం ఓ ప్రభంజనం..

పుస్తకావిష్కరణలో రామోజీరావ్ మండలి (ఫైల్ ఫోటో)

విశాలాంధ్ర-అవనిగడ్డ : ఈనాడు గ్రూప్‌ల అధినేత రామోజీరావ్ మరణంతో తెలుగు జాతీ ఒక మహోన్నత దిగ్గజాన్ని కోల్పోయిందని మాజీ మంత్రి, మాజీ ఉపసభాపతి అవనిగడ్డ ఎం.ఎల్.ఎ మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆయన శనివారం మృతి చెందడంతో తనతో మండలి అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ కొన్ని విషయాలను వెల్లడించారు. రామోజీరావ్ జీవితం ఒక ప్రభంజనం అని, ఆయన కలం విప్లవ కెరటం అని పట్టుదల, దృఢదీక్ష, మనో నిబ్బరంతో సామాన్య స్థితి నుండి అసామాన్య స్థితికి ఎదిగిన ఆయన జీవితం ఒక వ్యక్తిత్వ వికాస గ్రంథం అని భావితరాలకు మార్గదర్శకం కావాలన్నారు. పత్రికా రంగ చరిత్రలో ఈనాడు పత్రిక, ఈటివి ఒక సంచలనం. సిని రంగ చరిత్రలో రామోజీ ఫిలిం సిటీ ఒక అద్భుతం అని, వ్యాపార రంగంలో మార్గదర్శి చిట్ ఫండ్, ప్రియ పచ్చళ్ళు, ఆయన ఏదీ చేపట్టినా బంగారమయం అయ్యిందన్నారు. 1977 ఉప్పెన సమయంలో దివిసీమ దీనగాథలను లోకానికి చాటిచెప్పి ఈ నాడు సహాయ నిధి ద్వారా 3,73,927 రూపాయలు సేకరించి పాలకాయతిప్పలో 112 గృహాలు, కృష్ణాపురంలో 22 గృహాలు రామకృష్ణ మిషన్ ద్వారా నిర్మింపచేశారన్నారు. పాలకాయతిప్పకు రామోజీరావ్ వచ్చినప్పుడు అవనిగడ్డ గాంధీక్షేత్రానికి తీసుకువెళ్ళి అనాధ పిల్లల శరణాలయాన్ని చూపించడం జరిగిందని, అదే రామోజీరావ్ అని మొట్ట మొదటి సారిగా కలుసుకున్న సందర్భం అన్నారు. ఆ తరువాత తెలుగు భాషా పరిరక్షణలో వారు నన్ను వెన్నుతట్టి ప్రోత్సహించారని అధికార భాషా కమీషన్ అధ్యక్షులు అయినప్పుడు అందించిన సహకారం అంతా ఇంతా కాదనివారు జీవించి ఉన్న కాలంలో తెలుగు మసక బారుతుంటే బాధ కల్గుతుందని, ఎలాగైనా తెలుగును నిలబెట్టాలని అనేవారని, తెలుగు భాషా పరిరక్షణకు వారు చేసిన కృషి మహోత్తరమైనదని, ఆంధ్రపదాలకు, తెలుగు పదాలను సృష్టింపచేసి ఈ నాడు, ద్వారా వ్యాప్తికి తెచ్చారన్నారు. ఒక మహా నిఘంటు నిర్మాణానికి కూడా శ్రీకారం చుట్టారని, తెలుగు జాతీ వైభవ ఉన్నతికి కృషి చేసిన మహోన్నతమైన వ్యక్తి రామోజీరావ్ అన్నారు. నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య పరిరక్షణకు అలుపెరుగని పోరాటం చేసిన అక్షర యోధుడు రామోజీరావ్ అన్నారు. తెలుగు జాతీకి సవాళ్ ఎదురైనప్పుడు దీటుగా ఎదురించి నిలబడిన మహా ధైర్యశాలి అని, ఆయన జీవితం ఒక ప్రభంజనం అని ఆయన కలం విప్లవ కెరటం అని, రామోజీరావ్ మరణం తెలుగు జాతీకి తీరని లోటే కాకుండా వ్యక్తిగతంగా ఒక హితైషిని కోల్పోయారన్నారు. ఆయన ఆత్మశాంతి కలగాలని కోరుతూ రామోజీరావ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

అక్షర యోధుడు రామోజీకి ఘన నివాళి

విశాలాంధ్ర- కంచికచర్ల: కృషి ఉంటే మనుషులు ఋషి అవుతారు అనడానికి నిదర్శనం రామోజీరావు అని, ఆయన వ్యాపార దక్షత, సమయ పాలన, పోరాటం భావితరాలకు స్ఫూర్తి అని కంచికచర్ల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కోగంటి బాబు అన్నారు. పార్టీ కార్యాలయంలో శనివారం ఈనాడు సంస్థల అధిపతి చెరుకూరి రామోజీరావు చిత్రపటానికి తెదేపా నాయకులతో కలిసి కోగంటి బాబు ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కోగంటి మాట్లాడుతూ వివిధ రంగాలలో రామోజీరావు చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు గుత్తా రత్నం, తాడపనేని లక్ష్మణరావు, గుత్తా ఓంకార్, తోట మల్లికార్జునరావు, కోపూరి ఫణి కుమార్, ఓర్సు రాజేష్, బర్రె శంకరరావు, పఠాన్ బాజీ ఖాన్, పరాల శీను, బండ్ల మూడి బుజ్జి,రాయల సాంబశివరావు, వనపర్తి వెంకటేశ్వరరావు, గుదే నరేష్ పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్న టీడీపీ శ్రేణులు

విశాలాంధ్ర-వీరులపాడు: సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం తెదేపా, జనసేన విజయపరంపరతో మండలంలోని చౌటపల్లి, దొడ్డదేవరపాడు, చెన్నారావుపాలెం, దాచవరం, బోడవాడ గ్రామాల కార్యకర్తలు,మహిళలు తెలంగాణా రాష్ట్రంలోని జమలాపురం వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి కాలినడకన వెళ్లి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

రామోజీ భావి తరాలకు స్ఫూర్తి: సౌమ్య

విశాలాంధ్ర-నందిగామ: ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు మృతిపై నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సంతాపం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ కాకానీ నగర్ పార్టీ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి పట్టణ పార్టీ శ్రేణులతో కలసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అడుగు పెట్టిన ప్రతీ రంగంలోనూ ఆయన తన మార్క్ చూపించారన్నారు. తెలుగు భాష, జర్నలిజానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. 88ఏళ్ల వయస్సులోనూ క్రమశిక్షణ, నిబద్ధత, సమయపాలన నడుచుకునే వారని, ఆయన ఎంతో మందికి స్ఫూర్తిదాయకమన్నారు.

ఎమ్మెల్యే సౌమ్యను కలిసిన అధికారులు

విశాలాంధ్ర-నందిగామ: నియోజకవర్గ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యను పలు శాఖల అధికారులు కలసి శుభాకాంక్షలు తెలిపారు. నందిగామ ఐసిడిఎస్ ప్రాజెక్టు అంగన్వాడీ కార్యకర్తలు, అయాలు మండల గ్రామ కార్యదర్శులు, పలు సంఘాల ఉపాధ్యాయులు, మండల టిడిపి నాయకులు వేల్పుల బిక్షాలు, షేక్ షాబ్జాన్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యను పూలమాల శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ను నందిగామ మండలం తొర్రగుడు పాడు సర్పంచ్ చెరుకూరు హైమారావ్ పలువురు సర్పంచులు నాయకులు కలసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

వెంకట రమణకు మండలి సంతాపం

విశాలాంధ్ర-అవనిగడ్డ : మహా కవి శ్రీ శ్రీ కుమారుడు అనారోగ్యంతో అమెరికాలో మృతి చెందగా అవనిగడ్డ ఎం.ఎల్.ఎ మండలి బుద్ధప్రసాద్ సంతాపం తెలియజేశారు. మహాకవి, శ్రీశ్రీ కుమారుడు శ్రీరంగం వెంకట రమణ(59) అనారోగ్య కారణాలతో అమెరికాలో చనిపోవడంతో శుక్రవారం ఈ మేరకు ఆయన బంధువు రమణ యశశ్వి గుంటూరు ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీరంగం వెంకట రమణ కుటుంబం పాతిక సంవత్సరాలు క్రితం అమెరికాలో స్థిరపడగా ఫైజర్ కంపెనీలో వెంకట రమణ పరిశోధన విభాగంలో విధులు నిర్వహిస్తున్నారని, ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు కాగా కుమారుడు శ్రీనివాసరావు (శ్రీ శ్రీ) అని, కుమార్తెకు కవిత అని పేర్లు పెట్టుకున్నారన్నారు. వెంకట రమణ కుటుంబానికి అవనిగడ్డ ఎం.ఎల్.ఎ మండలి బుద్ధప్రసాద్ కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి జివి పూర్ణచంద్ పలువురు సాహితీ వేత్తలు శనివారం సానుభూతి తెలిపారు.

ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

విశాలాంధ్ర, కూచిపూడి: మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం లో అడ్మిషన్స్ ప్రారంభమై ఆశాజనకంగా సాగుతున్నాయని ఆ కళాశాల ప్రధానాచార్యులు కే ఏ వి ఎస్ వి ప్రసాదశాస్త్రి పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థిని విద్యార్థులు ఈ కళాశాలలో జనరల్ కోర్సులైన ఎంపీసీ, బైపిసి, సీఈసీ, హెచ్. ఇ సి లలో, వృత్తి విద్య కోర్సులైన ఏ అండ్ టీ, ఓ ఏ ఎస్, ఎం అండ్ ఏటి కోర్సులలో పరిమిత సీట్లు కోసం కళాశాల కార్యాలయంలో పనిచేసే సమయంలో సంప్రదించాలని కోరారు. జనరల్ కోర్సులకు ఒక్కొక్క గ్రూపులో 88, వృత్తి విద్యా కోర్సులో ఒక్కొక్క గ్రూపుకు 30 చొప్పున ఇంగ్లీష్ తెలుగు మీడియంలో సీట్లలో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.